క్లుప్తంగా

రాజీవ్ యువ వికాస్‌ను సద్వినియోగం చేసుకోండి

శంకర్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాస్ పథకానికి సంబంధించి అర్హులైన యువకుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ యోగేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారుల కోసం మున్సిపల్ కార్యాలయంలో ప్రజాపాలన కేంద్రాలు ఏర్పాటు చేశామని, వాటిలో నేరుగా వెళ్లి దరఖాస్తులు అందించాలని సూచించారు. ఈ నెల 14వరకు గడువు ఉందని, అర్హులైన యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గడువు పెంపు

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాస్ పథకానికి గడువు పెంచినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. అర్హులైన యువకులు ఈ నెల 14వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైనవారు మీసేవ, ఆన్‌లైన్ కేంద్రాల వద్ద దరఖాస్తు చేసుకోవాలని, అనంతరం ఆ పత్రాలను మండల పరిషత్ కార్యాలయంలో ఇవ్వాలని తెలిపారు. రేషన్‌కార్డు ఉన్నవారు కుల ధ్రువపత్రంతో, లేనివారు కుల ధ్రువపత్రంతో పాటు ఆదాయ ధ్రువపత్రాన్ని సమర్పించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

శబరిమల పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ



పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

మొయినాబాద్‌రూరల్: స్వామి శరణం అయ్యప్ప శరణం అంటూ శబరిమలకు భక్తులందరం ఐకమత్యంగా తరలివెళ్దామని అయ్యప్ప స్వామి పాదయాత్ర గురుస్వామి అల్లం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్ రెవెన్యూ పరిధిలో గల అల్లం శ్రీనివాస్‌రెడ్డి ఫామ్ హౌజ్‌లో అయ్యప్ప మహాపాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆయన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాదయాత్రలో పాల్గొనే భక్తులందరూ సభ్యత్వ సమోదుతో పాటు ఇన్సూరెన్స్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భద్రేశ్వర్, నవీన్, కిరణ్, సురేందర్‌రెడ్డి, శివ, సంతోష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు రానీయొద్దు

ఎంపీడీఓ వెంకయ్య

శంకర్‌పల్లి: గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ వెంకయ్య అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారుల్లో అర్హులను గుర్తించాలని తెలిపారు. ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా మరమ్మతులు చేయించాల్సిన అవసరం ఉంటే, వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. రాజీవ్ యువ వికాస్ పథకంలో భాగంగా మొదట ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారు దగ్గరలోని మండల కేంద్రాల్లో ఆ ప్రతులను అందించాలని సూచించారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు లేనందునా పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని, విధుల్లో ఎక్కడ నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమమే ధ్యేయం

సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి



లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న సురేందర్‌రెడ్డి, నాయకులు

షాబాద్: పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఏట్ల ఎర్రవల్లి గ్రామంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీరాంరెడ్డి, మాజీ సర్పంచ్ నర్సింలు, నాయకులు కుమ్మరి వేణు, రాజేందర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, మల్కి నర్సింలు, జగన్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా?

- అధ్వానంగా తోల్‌కట్ట-నక్కలపల్లి రోడ్డు
- గుంతలు, కంకర తేలిన దారులపై నరకయాతన
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



నక్కలపల్లి సమీపంలో ప్రమాదకరంగా మారిన రోడ్డు

మొయినాబాద్‌రూరల్: గ్రామీణ రోడ్లన్నీ అధ్వానంగా మారడంతో వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో గుంతలు పడి, కంకర తేలడంతో నరకయాతన పడుతున్నామని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. తోల్‌కట్ట-నక్కలపల్లి రోడ్డు మరమ్మతులకు గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరైనా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవంతో పనులు ప్రారంభించలేదు. దీంతో రెండేళ్లుగా ఆయా గ్రామాల రోడ్లపై ప్రయాణికులు, స్థానిక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అయినా దృష్టి సారించి రోడ్డు అభివృద్ధికి కృషి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నిధులు మంజూరైనా..

మండల పరిధిలోని తోల్‌కట్ట చౌరస్తా మొదలుకొని తోల్‌కట్ట గ్రామం, ఎత్‌మార్‌పల్లి, నక్కలపల్లి వరకు రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో స్థానిక ప్రజలు, వాహనాదారులు, ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు నరకయాతన పడుతున్నారు. ఆయా గ్రామాల రోడ్ల మరమ్మతులకు గత ప్రభుత్వ హయాంలో రూ.1.20 కోట్లు సీసీఆర్ నిధులు మంజూరయ్యాయి. నిధులు మంజూరైనా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో పనులు ప్రారంభించలేదు. దీంతో ప్రయాణికులు, ప్రజలు ఈ రోడ్డుపై వెళ్తూ నరకయాతన పడుతున్నారు. అడుగడుగునా గుంతలు ఉండడంతో రాత్రివేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాలకు గురై కాళ్లు, చేతులు విరిగిన సంఘటనలు ఉన్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. తోల్‌కట్ట చౌరస్తా నుంచి ఎత్‌మార్‌పల్లి, నక్కలపల్లి ఇటూ చేవెళ్ల, శంషాబాద్ ఎయిర్‌పోర్టుతో పాటు నక్కలపల్లి నుంచి షాబాద్ మండలంలోని హైతాబాద్, సర్దార్‌నగర్ మార్కెట్‌కు వెళ్లే రహదారి కావడంతో దగ్గర మార్గాన్ని వాహనాదారులు ఎంచుకొని ప్రయాణిస్తున్నారని పేర్కొంటున్నారు. ఈ రోడ్డు నిర్మిస్తే వాహనాదారులకు ఎంతో మేలు జరుగుతుందని, ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మంజూరైన నిధులతో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతున్నారు.

నరకయాతన పడుతున్నాం



తోల్‌కట్ట చౌరస్తా మొదలుకొని నక్కలపల్లి వరకు రోడ్డుపై అడుగడుగునా గుంతలు పడి నరకయాతన పడుతున్నాం. మొయినాబాద్ మండలానికి మారుమూల గ్రామం నక్కలపల్లి. మండలం నుంచి 20 కిలోమీటర్లు దూరంలో ఉన్న ఈ నక్కలపల్లిని ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోని అభివృద్ధికి కృషిచేయాలి. గత ప్రభుత్వంలో రోడ్డుకు నిధులు మంజూరయ్యాయి. కానీ పనులు మాత్రం ప్రారంభించలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మించేందుకు కృషిచేయాలి.

–బి.అంజయ్యగౌడ్, నక్కలపల్లి

ప్రమాదాలు జరుగుతున్నాయి



నక్కలపల్లి రోడ్డుపై అడుగడుగునా గుంతలే ఉన్నాయి. తోల్‌కట్ట చౌరస్తా నుంచి నక్కలపల్లి వరకు దాదాపు ఏడు కిలోమీటర్లు. ఈ రోడ్డు గతంలో ఎప్పుడో నిర్మించారు. దీంతో అధ్వానంగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు రోడ్డు పనులు చేపట్టేందుకు కృషిచేయాలి.

–స్వప్న, నక్కలపల్లి మాజీ సర్పంచ్

టెండర్లు వేశాం.. ముందుకు రావడం లేదు

తోల్‌కట్ట చౌరస్తా నుంచి నక్కలపల్లి వరకు రోడ్డు వేసేందుకు నిధులు మంజూరైన మాట నిజమే. గత ప్రభుత్వంలో రోడ్డు అభివృద్ధికి రూ.1.20కోట్ల నిధులు మంజూరయ్యాయి. అప్పటి నుంచి టెండర్లకు పిలుస్తున్నా ఎవరూ రావడం లేదు. కాంట్రాక్టర్లు ముందుకు వస్తే రోడ్డు పనులు ప్రారంభించేందుకు కృషిచేస్తాం.

–విజయ్‌కుమార్, పంచాయతీరాజ్ డిప్యూటీ డీఈ

గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల కార్యవర్గం ఎన్నిక



అంజనేయులును సన్మానిస్తున్న హెచ్‌ఎంలు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కేతిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల పావని రిసార్ట్‌లో 14 జిల్లా పరిషత్ పాఠశాలలకు సంబంధించిన హెచ్‌ఎంలు ఏకమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొని ప్రకటించారు. ఈ సందర్భంగా ఈ ఎన్నికల్లో హిమాయత్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.అంజనేయులును అధ్యక్షుడిగా ఎన్నుకొని సన్మానించారు. ఈ సందర్భంగా అంజనేయులు మాట్లాడుతూ.. పాఠశాలల అభివృద్ధితో పాటు సమస్యలను పరిష్కరించేందుకు తమవంతు పనిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మండల విద్యాధికారి వెంకటయ్య, నూతన మండల విద్యాధికారి మల్లయ్య, ప్రధానోపాధ్యాయులు లక్ష్మారెడ్డి, అమ్డాపూర్ రేణుక, శ్రీనివాస్‌గౌడ్, రఘునాథ్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏడుపాయల దుర్గమ్మ ఆలయంలో పూజలు



ఎమ్మెల్యేకు ప్రసాదం అందజేస్తున్న అర్చకులు

చేవెళ్ల: మెదక్ జిల్లాలోని ఏడుపాయల దుర్గమ్మను ఎమ్మెల్యే కాలె యాదయ్య దర్శించుకున్నారు. మంగళవారం ఆయన ఏడుపాయలకు వెళ్లి నియోజకవర్గ నాయకులతో కలిసి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఆలయంలో అమ్మవారి దర్శనం అనంతరం ఆశీర్వదాలు, తీర్థప్రసాదాలు అందించారు. ఆయన వెంట చేవెళ్ల, శంకర్‌పల్లి, నవాబుపేట మండలాలకు చెందిన నాయకులు ఉన్నారు.

అంబలి కేంద్రం ప్రారంభం

మొయినాబాద్‌రూరల్: వేసవిలో రాగి అంబలి ఆరోగ్యానికి ఎంతో మంచిదని కనకమామిడి వేంకటేశ్వర స్వామి దేవాలయ చైర్మన్, గురు దత్తాత్రేయస్వామి కమిటీ సభ్యుడు కొండా లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కనకమామిడి గ్రామంలో గురు దత్తాత్రేయస్వామి ఆలయం ఎదుట రాగి అంబలి కేంద్రాన్ని లక్ష్మీకాంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాగి అంబలి కేంద్రాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

యోగా శిక్షణను సద్వినియోగం చేసుకోండి

పతంజలి యోగాసమితి వ్యవస్థాపకుడు పానుగంటి శశిధర్



యోగా శిక్షణను ప్రారంభిస్తున్న శశిధర్

షాద్‌నగర్: పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని యోగా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పానుగంటి శశిధర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని సహారా కాలనీలో గల వినాయక మండపంలో ఆయన ఉచిత యోగా శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి రోజు యోగ సాధన చేయడంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా యోగ సాధన చేయాలని సూచించారు. యోగాతో మానసికోల్లాసం కలగడంతో పాటుగా రోగనిరోధకశక్తి పెరుగుతుందన్నారు. మహిళల కోసం ప్రతి రోజు ఉదయం 5 గంటల నుంచి 6 గంటల వరకు యోగా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. పరిసర కాలనీల మహిళలు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యోగా గురువు హరిత, రామయ్య, విజయకుమార్, కావ్య, కవిత, సౌజన్య, సుగుణ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

- సూపర్‌వైజర్ అండాలు
- అంగన్‌వాడీల్లో పోషణ పక్షోత్సవాలు ప్రారంభం



షాద్‌నగర్: మాట్లాడుతున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అండాలు



చేవెళ్ల: మాట్లాడుతున్న సీడీపీఓ హెప్సిబా

షాద్‌నగర్: పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అండాలు అన్నారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద సెక్టార్ పరిధిలో గల కిషన్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలు చేశారు. గర్భిణుల ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చిరు ధాన్యాలను ఉపయోగించి ఆహార వంటకాలను తయారు చేయడంపై అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. గర్భిణులు తమ ఆరోగ్యంపట్ల జాగ్రత్తగా ఉండాలని, పుట్టిన బిడ్డకు వెంటనే తల్లి పాలు పట్టించాలని సూచించారు. అనంతరం ఆర్‌బీఎస్ ఆధ్వర్యంలో ఉచితంగా కంటి పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్ డాక్టర్ విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు హేమలత, సమత, సుజాత, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

కొందుర్గు: మండలంలోని శ్రీరంగాపూర్, సోమారం పహడ్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం పోషణ పక్షోత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోత్స్న హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమం ఏప్రిల్ 8వ తేదీ నుంచి 22 వరకు కొనసాగుతుందన్నారు. గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకుంటేనే పిల్లలు ఆరోగ్యంగా ఎదుగుతారని సూచించారు. రోజు ఆహారంలో పాలు, గుడ్డు, పప్పులు, ఆకుకూరలు ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం శ్రీరంగాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీరామ్, అంగన్‌వాడీ టీచర్లు లలితమ్మ, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు పోషకాహారం తీసుకోవాలి

చేవెళ్ల: మహిళల ఆరోగ్యం కోసం ప్రభుత్వం పోషణ పక్వాడా కార్యక్రమాలు నిర్వహిస్తోందని ఐసీడీఎస్ సీడీపీఓ హెప్సిబా తెలిపారు. చేవెళ్లలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ పక్షం కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే పిల్లలు, కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఈ నెల 8వ తేదీ నుంచి 22 వరకు పోషణ పక్షం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మహిళలకు పోషకాహారంపై అవగాహన కల్పించి పోషకాహారం తీసుకునేందుకు కృషి చేస్తున్నామన్నారు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉండేందుకు గర్భిణులు, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నామని, ప్రతి ఒక్కరూ సద్వియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, మహిళలు పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా రథోత్సవం

షాద్‌నగర్: శ్రీరామనవమిని పురస్కరించుకొని మండల పరిధిలోని వెలిజర్ల గ్రామంలో సీతారామచంద్రస్వామి రథోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి రథంలో స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి గ్రామంలోని పురవీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. యువకులు, నాయకులు రథాన్ని లాగుతూ భక్తిభావాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో నాయకులు వాడ్యాల సుధాకర్‌రెడ్డి, కరణం రాములు, వెంకటయ్య, రాజు, జగన్, నర్సింలు, అనిమి గణేశ్, బాబునాయక్, జాంగారి రవి, దొడ్డి శ్రీనివాస్, తిరుపతి, జాంగారి జంగయ్య, శివరాజ్‌గౌడ్, దొడ్డి రవీందర్, మధుసూదన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ సాధన దీక్షకు తరలిన నాయకులు



దీక్షకు మద్దతు తెలుపుతున్న జాగృతి నాయకులు

షాద్‌నగర్: అసెంబ్లీ ప్రాంగణంలో మహాత్మా జ్యోతి బాపూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఇందిరా పార్కు వద్ద ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో పూలే విగ్రహ సాధన దీక్షను చేపట్టారు. ఈ దీక్షకు తెలంగాణ జాగృతి నియోజకవర్గ మాజీ కన్వీనర్ ముస్తఫా ఆధ్వర్యంలో నాయకులు తరలివెళ్లి దీక్షకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ముస్తఫా మాట్లాడుతూ.. అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే బీసీ బిడ్డలు ఏకమై ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. దీక్షకు తరలిన వారిలో రమేశ్‌నాయక్, బాలాజీ, ఉదయ్, పాండు, నవీన్, అవినాశ్, రాజు, శ్రీనునాయక్, సంతోష్, విజయ్ తదితరులు ఉన్నారు.

శోభాయాత్రను విజయవంతం చేయండి



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న గోరక్షక్ దళ్, బజరంగ్‌దల్ సభ్యులు

చేవెళ్ల: ఈ నెల 12న చేవెళ్లలో హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న వీర హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలని రాష్ట్ర గోరక్ష దళ్ సభ్యుడు రాఘవేందర్ అన్నారు. చేవెళ్లలోని హనుమాన్ ఆలయం వద్ద వీర హనుమాన్ శోభాయాత్ర వాల్‌పోస్టర్‌ను మండల గోరక్ష దల్ ప్రముఖ్ మల్లేశ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టణ కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో 12వ తేదీన శోభయాత్రలు వైభంగా జరుగుతాయని చెప్పారు. ఈ వేడుకల్లో హిందువులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పట్టణ కేంద్రంలో భారీ ఎత్తున ఈ కార్యక్రమం నిర్వహించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్, బజరంగ్‌దళ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీసీసేన జిల్లా యువజన కార్యదర్శిగా శివ



శివకు నియామకపత్రం అందజేస్తున్న బీసీ సేన జాతీయ అధ్యక్షుడు కృష్ణయాదవ్

షాద్‌నగర్: పట్టణంలోని బీసీ సేన కార్యాలయంలో నియోజకవర్గ అధ్యక్షుడు కత్తిచంద్ర శేఖరప్ప ఆధ్వర్యంలో మంగళవారం సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణయాదవ్ సమక్షంలో జిల్లా యువజన కార్యదర్శిగా పట్టణానికి చెందిన దేశమోని శివను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బర్క కృష్ణయాదవ్ మాట్లాడుతూ.. బీసీలను ఏకతాటిపైకి తీసుకురావాలని సూచించారు. బీసీలు ఐకమత్యంతో ముందుకు సాగినప్పుడే హక్కులను సాధించుకుంటామన్నారు. బీసీల అభ్యున్నతికి బీసీ సేన ఆహర్నిశలు కృషి చేయాలన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన దేశమోని శివకు నియామకపత్రం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో బీసీసేన నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు బాస వరలక్ష్మి, నాయకులు చందులాల్, నరేశ్, రవి, భూషణ్, వెంకటేశ్, శ్రీనివాస్, నవీన్, శ్రీను, భాగ్యలక్ష్మి, సౌజన్య, మమత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

షాద్‌నగర్: విద్యార్థులు విద్యతో పాటుగా అన్ని రంగాల్లో రాణించాలని సంస్కార భారతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రంగయ్య అన్నారు. మంగళవారం పట్టణంలోని భాగ్యనగర్‌కాలనీలో గల కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో ప్రిన్సిపాల్ రఫత్ సుల్తానా ఆధ్వర్యంలో ముంతాజ్ ఫంక్షన్ హాలులో యూకేజీ, 5వ తరగతి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో హాజిపల్లి మాజీ సర్పంచ్ సింగారం శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ధరల పెంపుతో పేదలకు నష్టం

ఆమనగల్లు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు అనురాధ ఆరోపించారు. ఎల్‌పీజీ సిలిండర్ ధరలను పెంచి సామాన్యులను సర్కారు మరోసారి దగా చేసిందని విమర్శించారు. ఈ మేరకు పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి తరచూ ఎల్‌పీజీ సిలిండర్ల ధరలను పెంచుతుందని ఆరోపించారు. దీంతో సామాన్య, మధ్య తరగతి, పేదలు జీవించే పరిస్థితి లేదన్నారు. మోదీ సర్కారు ప్రజలకు చేసిందేమి లేదని, ప్రచారం మాత్రం చేసుకుంటూ ప్రజలను మభ్యపెడుతుందని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలంతా ఉద్యమించాలని కోరారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అర్జున్ రావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పంతునాయక్, మాజీ సర్పంచ్ శ్రీనునాయక్, నాయకులు సయ్యద్ ఖలీల్, బాలస్వామి, రమేశ్, వస్పుల సాయిలు, శివకుమార్, సైదులుగౌడ్, గణేశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అనురాధ